# ఏరియా ఆసుపత్రిలో కలెక్టర్ తనిఖీ

**జహీరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని బుధవారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించి ఆసుపత్రికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డాక్టర్లను ఆదేశించారు. ఆసుపత్రిలోని గైనిక్ వార్డు, చిల్డ్రన్ వార్డులతో పాటు పేషంట్ల వార్డుల్లోకి వెళ్లి రోగులకు అందుతున్న సేవలను ప్రత్యక్షంగ పరిశీలించారు. కలెక్టర్ ఆసుపత్రికి వచ్చే వరకు డాక్టరుల ఎవరూ యూనిఫామ్ ధరించకపోవడంతో వారిపై కలెక్టర్ ఆక్షింతలు చల్లారు. ఆసుపత్రిలో స్కానింగ్ చేసే రేడియో రేడియాలజిస్ట్ డాక్టర్ లేకపోవడంతో వారానికి ఒక సారి మాత్రమే వచ్చి స్కానింగ్ చేస్తున్నారని డాక్టర్లు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆసుపత్రిలో రెగ్యూలర్ రేడియాలజిస్టును నియమించాలని కలెక్టర్‌కు వినతి చేశారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఓ ఎస్ రాజుఉ, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్, వైద్యాధికారులు డాక్టర్ నాగరాజ్ పాటిల్, డాక్టర్ బాలరాజ్, డాక్టర్ శేషగిరిరావు, డాక్టర్ కిరణ్మయిలు ఉన్నారు.



## మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
## వార్త

# మాజీ సిఎం కెసిఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి



**నర్సాపూర్ జూన్ 26. ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ను ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌లో బుదవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి బిఆర్ఎస్ నాయకులతో కలిసి మర్యాద పూర్వకంగా కళిశారు. ఈ సందర్బంగా నర్సాపూర్ నియోజక వర్గంలోని రాజకీయ పరిస్థితులపై మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి తో చర్చించినట్లు సమాచారం ఈ మేరకు కెసిఆర్ ను కలిసిన వారిలో నర్సాపూర్ మున్సిఫల్ వైస్ చైర్మన్ నహిమొద్దీన్, బిఆర్ఎసన యువ నాయకుడుచ రమేశ్‌నాయక్, షేక్ హుస్సెన్ తదితరులు ఉన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న సిపి అనురాధ

## డ్రగ్స్ రహిత సమాజాన్ని భావితరాలకు అందిద్దాం : సిపి అనురాధ

**సిద్దిపేట అర్బన్, జూన్ 26, ప్రభాతవార్త :** డ్రగ్స్ మహమ్మారిని తరిమివేసి డ్రగ్స్ రహిత సమాజాన్ని భావితరాలకు అందిద్దామని సీపీ డా॥ అనురాధ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ డ్రగ్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం సిద్దిపేట పాత బస్టాండు సమీపంలో, సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమాలలో ఆమె పాల్గొని మాట్లాడారు. సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించడంతో పాటు మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటుచేయాలని సూచించారు. మత్తుకు, గంజాయికి అలవాటు పడి జీవితాలను నాశన ం చేసుకొవద్దన్నారు. డ్రగ్ రహిత సమాజం కోసం అందరూ కృషిచేయాలన్నారు. మాదకద్రవ్యాలు రవాణా చేస్తున్నట్లు, అమ్ముతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసుకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు మల్లారెడ్డి, రామచంద్రరావు, సుభాష్‌చంద్రబోస్, మధు, ఈఎస్ శ్రీనివాసమూర్తి, ఉపేందర్, లక్ష్మీబాబు, విద్యాసాగర్, రామకృష్ణ, కిరణ్, గురుస్వామి, ధరణికుమార్, రాజేష్, పూర్ణచందర్, ప్రసాద్, విద్యార్థులు, పాఠశాలల, కళాశాలల యజమాన్యాలు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి : రవికుమార్



కలెక్టరేట్ ఎదుట అందోళన చేస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, జూన్ 26, ప్రభాతవార్త :** కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందిని క్రమబద్ధీకరణ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కొనసాగుతున్న మున్సిపల్ కార్మికులను వెంటనే క్రమబద్ధీకరణ చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎపిలో పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.21 వేల వేతానాన్ని చెల్లిస్తున్నారని మన రాష్ట్రంలో అపద్ధతిని అమలు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. పట్టణాలలో, నగరాలలో ప్రజల అరోగ్యం పట్ల నిరంతరం శ్రమిస్తున్నా మున్సిపల్ సిబ్బంది అడుగడుగునా వివక్షతకు గురువుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 60 విడుదల చేసి కేటగిరీల వారీగా వేతనాలను అమలు చేయాలన్నారు. కార్మికులకు ప్రమాద బీమా రూ. 5లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. 5 లక్షలు చెల్లించాలన్నారు. కార్మికుడు మరణిస్తే దహన సంస్కారాలకు రూ.30వేలు ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని లేనియెడల అందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియూ నాయకులు ఇప్పకాయల శోభ, రాళ్లబండి భాస్కర్, రాజయ్య, మహేష్, రాజు, సంతోష్, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఎవోకు అందజేశారు.

## తోటపల్లి వాసి శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రదానం

**బెజ్జంకి, జూన్ 26, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తోటపల్లి గ్రామానికి చెందిన మాశం శ్రీనివాస్ అనే యువకుడికి కాకతీయ యూనివర్శిటీ డాక్టరేట్ ప్రధానం చేసింది. మాశం శ్రీనివాస్ కాస్ట్ లీడర్షిప్ అండ్ పాలిటిక్స్ తెలంగాణ స్టేట్-ఎ స్టడీ అఫ్ షెడ్యూల్ క్యాస్ట్ అనే అంశంపై పరిశోధన చేసి కాకతీయ యూనివర్శిటీలో పొలిటికల్ సైన్ విభాగం ప్రొ॥ హరిప్రసాద్ పర్యవేక్షణలో తన రాసిన వ్యాసాన్ని సమర్పించగా కాకతీయ యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రధానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొ॥ నరసింహాచారి తెలిపారు. ఈ సందర్భంగా విభాగ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, తోటపల్లి గ్రామస్తులు శ్రీనివాస్‌ను అభినందించారు.

## వైష్ణవికి ప్రశంసా పత్రం అందజేత

**తొగుట, జూన్ 26, ప్రభాతవార్త:** అంతర్జాతీయ డ్రగ్స్ నిర్మూలన దినోత్సవంలో భాగంగా సిద్దిపేట పోలీసు కమిషనర్ అధ్వర్యంలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీలలో మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామానికి చెందిన చిక్కుడు వైష్ణవి సిద్దిపేట కమిషనర్ డా॥అనురాధ చేతుల మీదుగా ప్రథమ స్థానంలో ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. సిద్దిపేటలోని సిటిజన్స్ హైస్కూల్ 8వ తరగతి చదువుతున్న వైష్ణవి చదువుతో పాటు కో కరికులర్ విభాగాల్లో రాణిస్తూ తన ప్రతిభను చాటుతుంది. వైష్ణవి ప్రథమ స్థానంలో ప్రశంసా పత్రం అందుకోవడం పట్ల గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.



సీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థి

# మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి

## సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** మాదకద్రవ్యాలు, అక్రమ రవాణాను నిర్మూళించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మహిళా, శిశు, వయోవృద్దుల సంక్షేమశాఖ అధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ మను చౌదరి, జిల్లా పరిషత్ చైర్మన్ రోజాశర్మలు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ మెదక్ రోడ్డులోని హై స్కూల్ మైదానం నుంచి ప్రారంభమై పాత బస్టాండు వరకు సాగింది. అంతకు ముందు ప్రభుత్వం జారీచేసిన డ్రగ్స్‌కి నో చెప్పండి అని తెలిపే గోడ పత్రికను, టీ షర్ట్‌ను అవిష్కరించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ డ్రగ్స్, నార్కోటిక్ మాధక ద్రవ్యాల నిర్మూలనకు ఎన్నో చట్టాలు ఉన్నాయన్నారు. డ్రగ్స్ లాంటి చెడు అలవాటుకు బానిసలు కావొద్దన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు బారిన పడకుండా విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని అ లక్ష్యం దిశగా కృషి చేయాలన్నారు. మాదక ద్రవ్యాలను జిల్లా పరిపాలన యంత్రాంగం, పోలీసులు పూర్తిగా నిర్మూలించడానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎక్కడైనా డ్రగ్స్ అమ్ముతున్నట్లు రవాణా చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. విద్యార్థులు ఎలాంటి చెడు అలవాట్లకు బానిసలుకావొద్దన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ రోజాశర్మ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా స ంక్షేశాఖ అధికారి శారద, ఈఎస్ శ్రీనివాసమూర్తి, డిఆర్‌డిఏ పిడి జయదేవ్ అర్యా తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్



కర్కపట్లలో పోలీస్ డాగ్స్‌తో తనిఖీ చేస్తున్న ఎస్ఐ మధుకర్‌రెడ్డి

## కర్కపట్లలో పోలీస్ జాగిలాలతో తనిఖీలు

**మర్కుక్, జూన్ 26 (ప్రభాతవార్త):** సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని కర్కపట్ల గ్రామంతో పాటు ఇండస్ట్రియల్ ఏరియా తదితరప్రాంతాలలో మర్కుక్ ఎస్ఐ మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ జాగిలాలు(నార్కోటిక్ డాగ్స్)తో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాల బ్లాక్‌స్పాట్స్ గుర్తించినట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో మరికొన్ని బ్లాక్ స్పాట్స్‌లలో త్వరలో తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలు సమూలంగా నిర్మూలించే విధంగా ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. అమ్మేవారితోపాటు కొనేవారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు అమ్మినా, కొన్నవారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో మత్తు పదార్థాలు కలిగి ఉండి రవాణా చేసినా, ఇతరులకు అమ్మినా డయల్ 100కు లేదా మర్కుక్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

## ఘనంగా శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

**గజ్వేల్ టౌన్, జూన్ 26 (ప్రభాతవార్త):** పట్టణంలోని శ్రీసీతారామ ఉమా మహేశ్వర ఆలయంలో కొలువైన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ 36వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో గోవులకు పూజలు నిర్వహించగా ఆలయంలో గణపతి పూజ, పుణ్యావాచనం, నవగ్రహ పూజలు నిర్వహించడంతో పాటు అమ్మవారికి 54 కిలోల తేనె ఉపయోగించి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం సామూహిక కుంకుమార్చన, వాసవి పారాయణం, మంత్రపుష్ప మంగళహారతితో విశేష పూజలు నిర్వహించారు. వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మహా అన్న ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో అందరూ బాగుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు, మహిళలు, చిన్నారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి అభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి తదితరులు



కేతకి ఆలయాన్ని దర్శించుకుంటున్న మంత్రి దామోదర్ రాజనర్సింహా

## కేతకి ఆలయంలో మంత్రి పూజలు

**ఝరాసంగం, జూన్ 26, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీకేతకి సంగమేశ్వర ఆలయాన్ని బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రిని ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో సాగతం పలికారు. ఆలయంలో అర్చకలు వేద మంత్రాలు వల్లిస్తుండగా మంత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రికి ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం




పాఠశాలల బంద్ నిర్వహిస్తున్న ఎబివిపి

**కొమురవెల్లి, జూన్ 26, ప్రభాతవార్త:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కొమురవెల్లి పాఠశాలల బంద్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సావుల అదిత్య మాట్లాడుతూ మండలంలోని పలు ప్రైవేటు విద్యారంగ సంస్థలను స్వచ్ఛందంగా బంద్ చేయడం జరిగిందన్నారు. పలు ప్రభుత్వ పాఠశాలలను బైకాట్ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు, విద్యారంగ పట్ల పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఖాళీగాఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. సకాలం లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించాలన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నడిపిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అమర్, సందీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

**మిరుదొడ్డి, జూన్ 26, ప్రభాతవార్త :** మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామానికి చెందిన బిఅర్ఎస్ పార్టీ కార్యకర్త ఇటీవల ప్రమాదంలో మరణించిన ఎం.డి.నజీర్(టైలర్) కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ సభ్యుత్వం ఉండడంతో బాధిత కుటుంబానికి ప్రమాద బీమా పథకం కింద వచ్చిన రూ. 2 లక్షల చెక్కును దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు.

# మెదక్‌లో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

## పాల్గొన్న జిల్లా జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్ లక్ష్మీశారద, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 26 ప్రభాతవార్త:** మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలనుండి రాందాస్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్ పర్సన్ లక్ష్మీ శారద, సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్. జితేందర్, జిల్లాఎస్పీ బాలస్వామి, అడిషనల్ ఎస్పీ మహేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్, జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుభాష్‌చంద్రగౌడ్, జిల్లా అధికారులు, వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, బాల బాలికలతో చేపట్టిన ర్యాలీని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాందాస్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి డ్రగ్స్ దుర్వినియోగంపై, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సంతకాల సేకరణ నిర్వహించడం జరిగింది. అనంతరం మెదక్ పట్టణంలోని గీతా హైస్కూల్‌లో మాదక ద్రవ్యాల నిర్మూలన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సాక్ష్యం స్పష్టంగా ఉంది.. నివారణ పెట్టుబడి అనే అంశంపై జరిగిన సమావేశంలో కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్ పర్సన్ లక్ష్మీ శారద, సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్. జితేందర్, జిలాఎస్పీ బాలస్వామిలు ప్రసంగించారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలన వ్యతిరేక దినోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




మాదకద్రవ్యాల నిర్మూలన వ్యతిరేక దినోత్సవ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం



చేర్యాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎసిపి సతీష్

## యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దు : ఎసిపి సతీష్

**చేర్యాల, జూన్ 26, ప్రభాతవార్త :** యువత మత్తుపదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీష్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ఏసిపి ఆధ్వర్యంలో చేర్యాల, మద్దూరు పోలీసులు బుధవారం పలు పాఠశాలల, కళాశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి తెలంగాణ విగ్ర హం ముందు జాతీయరహదారిపై మానవహారం ఏర్పాటుచేసి, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏసిపి సతీష్ మాట్లాడుతూ యువత చెడు మార్గాల వైపు పయనించకుండా వివిధరంగాలలో నైపుణ్యాన్ని ప్రదర్శించి దేశ భవిష్యత్తుకు బంగారుబాటలు వేయడానికి కృషి చేయాలన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎవరైన మత్తుపదార్థాలు తీసుకుంటున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తమ పేర్లను గోప్యంగా ఉంచుతామని ఏసిపి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మంగళగిరి రామచంద్రమూర్తి, చేర్యాల ఎస్సై దామోదర్, మద్దూరు ఎస్సై షేక్ యూనస్ అహ్మద్ అలీ,ఎక్సైజ్ ఎస్సై సురేష్, కానిస్టేబుళుల, పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత

-గజ్వేల్ ఎసిపి పురుషోత్తంరెడ్డి



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఏసిపి పురుషోత్తంరెడ్డి

**గజ్వేల్, జూన్ 26 (ప్రభాతవార్త):** డ్రగ్స్ మహమ్మారిని తరిమేద్దాం, డ్రగ్స్ రహిత సమాజాన్ని భావితరాలకు అందిద్దామని గజ్వేల్ ఏసిపి కె. పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రజ్ఞాపూర్ రాజీవ్‌రహదారిపై వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి గజ్వేల్ పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గజ్వేల్ ఏసిపి పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని యాజమాన్యాలకు సూచించారు. పిల్లలు ఏమిచేస్తున్నారో తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు గమనిస్తుండాలన్నారు. యువత చెడు మార్గాల వైపు ఆకర్షితులవుతున్నారని, మత్తు, గంజాయికి అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఇకనుంచి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవించేవారు మానసిక స్థితిని కోల్పోయి నేరాలు చేసే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీఓ బన్సిలాల్, తహసీల్దార్ శ్రావణ్, గజ్వేల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైదా, ముత్యంరాజు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మారెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శివ కళ్యాణంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే

**మిరుదొడ్డి, జూన్ 26, ప్రభాతవార్త :** అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివ కళ్యాణం, రాజ్యశ్యామల యజ్ఞం కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు శ్రీనివాస్, బోరం రాజేశ్వర్ పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్‌ను తక్షణమే రద్దు చేయాలి

**సిద్దిపేట అర్బన్, జూన్ 26, ప్రభాతవార్త :** భారత రక్షణ రంగాన్ని ప్రైవేటు పరంచేసే అగ్నిపథ్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, అగ్నిపథ్ పథకం నిప్పులబాట పథకమని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్ అన్నారు. ఏఐవైఎఫ్ అధ్వర్యంలో అగ్నిపత్ పథకాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అర్మీ రిక్రూట్‌మెంట్ పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు యుద్ధప్రాతిపదికన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకలు జనగాం రాజ్‌కుమార్, బిచ్చల శ్రీనివాస్, సురేందర్, శ్రీను, లత పాల్గొన్నారు.

### కోడలు కాపురానికి రావడం లేదని

## మనస్తాపంతో అత్త ఆత్మహత్య

**ములుగు, జూన్ 26 (ప్రభాతవార్త):** కోడలు కాపురానికి రావడంలేదని మనస్థాపంతో అత్త ఆత్మహత్యచేసుకున్న సంఘటన ములుగు మండలం సింగన్నగూడ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వర్గల్ మండలం తునికిఖాల్సా గ్రామానికి చెందిన మరిగాల స్వరూప (45) కొడుకు కోడలు గొడవ పడ్డారు. దీంతో కోడలు అమ్మగారింటికి వెళ్లి కొద్దికాలంగా అక్కడే ఉంటోంది. ఈనెల 24న ములుగు మండల పరిధిలోని సింగన్నగూడ గ్రామంలో స్వరూప బంధువుల ఇంటికి శుభకార్యం ఉందని వెళ్లగా అక్కడ వారి బంధువులు మీ కోడలిని ఇంకా ఎప్పుడు మీ ఇంటికి తీసుకొస్తావు అని అడగడంతో మనస్థాపానికి గురై వారి ఇంటి నుండి మంగళవారం మధ్యాహ్నం వెళ్లిపోయింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో బంధువులు ఆమెను వెతకగా ఎక్కడ కనిపించలేదు. బుధవారం ఉదయం 7 గంటలకు నర్సాపూర్ గ్రామ చెరువులో ఓ మహిళ మృతదేహం తేలి ఉందని సమాచారం తెలుసుకున్న మృతురాలి కొడుకు చెరువు వద్దకు వచ్చి చూడగా చనిపోయింది తన తల్లేనని నిర్ధారించుకొని బోరున విలపించాడు. తల్లి మృతిపట్ల ఎవరిపైనా అనుమానం లేదని, ఆమె మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శంకర్ తెలిపారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**న్యాల్‌కల్, జూన్ 26, ప్రభాతవార్త:** తాగుడుకు బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన న్యాల్‌కల్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాము నాయుడు కథనం ప్రకారం... పుల్కల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన గంగిరెడ్డి రామ్‌రెడ్డి (47) తాగుడుకు బానిసై ఆరోగ్య క్షీణించడంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం న్యాల్‌కల్ గ్రామ శివారులో మామిడి చెట్టుకు ఉరిపెట్టుకుని మృతి చెందాడన్నారు. మృతుడి భార్య గంగిరెడ్డిగారి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ వివరించారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న హుస్నాబాద్ సిఐ

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో

## ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి : సిఐ

**హుస్నాబాద్ రూరల్, జూన్ 26,ప్రభాతవార్త :** మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సిఐ కొండ్ర శ్రీనివాస్ అన్నారు. బుధవారం మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్బంగా పట్టణంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో విద్యార్థులు, ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్బంగా సిఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాల విక్రయాలు, సేవించే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. హుస్నాబాద్ సర్కిల్ పరిధిలో ఎవరైనా ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడితే నేరుగా పోలీస్ స్టేషన్‌లో లేదా 100కు సమాచారం అందించవచ్చని చెప్పారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్, అక్కన్నపేట ఎస్ఐ తాండ్ర వివేక్, కోహెడ ఎస్ఐ సదువాల తిరుపతితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### డ్రగ్స్‌రహిత సమాజానికి ప్రతిఒక్కరి సహకారం అవసరం : సిఐ



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా జోగిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

**జోగిపేట, జూన్ 26, ప్రభాతవార్త:** డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సిఐ అనిల్‌కుమార్, ఎస్ఐ అరున్‌కుమార్‌గౌడ్ అన్నారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జోగిపేటలో పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని జోగినాథ చౌరస్తాలో విద్యార్థులతో మానవ హారాన్ని నిర్మించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ చాలామంది యువకులు డ్రగ్స్‌కు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. మత్తుపదార్థాలకు ఎవరూ అలవాటు పడొద్దని, వీటిని ఎవరైనా అమ్మితే తమ దృష్టికి తీసకురావాలని వారు కోరారు. డ్రగ్స్ నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యతగా భావించాలని కోరారు.

## హరీష్‌రావు రాజీనామా చేయాలి

టిపిసిసి అధికార ప్రతినిధి రామచంద్రగౌడ్



మాట్లాడుతున్న పల్లె రామచంద్రగౌడ్

**రామాయంపేట, జూన్ 26, ప్రభాతవార్త :** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచంద్రగౌడ్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో తీసుకునే నిర్ణయాన్ని 15 ఆగస్టు లోగా మాట ఇచ్చిన ప్రకారం కట్టుబడి రుణమాఫీ చేయడం జరుగుతుందని ఆయన గుర్తు చేశారు. అందులో భాగంగా సవాల్ విసిరిన మాజీ మంత్రి హరీష్‌రావు వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా సమర్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబిసి సెల్ జిల్లా కన్వీనర్ విప్లవకుమార్, సుంకోజు దామోదర్ చారి, మేఘమాగారి శంకరయ్య, భైరం శంకర్, ఆశాది రాజు, కోనాపూర్ సొసైటీ డైరెక్టర్ మామిడి సిద్దరాములు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

-ఎంపిటిసిల ఫోరం కార్యనిర్వాహక రాష్ట్ర అధ్యక్షుడు దేవి రవీందర్

**గజ్వేల్, జూన్ 26 (ప్రభాతవార్త):** గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని రాష్ట్ర ఎంపిటిసిల ఫోరం కార్యనిర్వాహక అధ్యక్షుడు దేవి రవీందర్ డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్ పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అధికారుల పాలనతో గ్రామాలు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయని, గ్రామ సర్పంచ్‌లు లేకపోవడంతో అభివృద్ధి జరగడంలేదన్నారు. గ్రామాల్లో పాలన వ్యవస్థ గాడితప్పిందని, అధికారుల పాలనలో అన్నీ అవస్థలేనని, సర్పంచ్‌ల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోతున్నాయన్నారు. గ్రామపంచాయతీలకు ఆరు నెలల నుండి నిధులు విడుదల చేయకపోవడంతో సపాయి కార్మికులకు జీతాలు రాక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొన్ని గ్రామాల్లో నీటి కొరత, విద్యుత్ సమస్యలు ఉన్నాయని, గ్రామాలను శుభ్రం చేయడానికి సైతం సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తూ సర్పంచ్ ఎన్నికలు నిర్వహించకపోవడం సిగ్గుచేటన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పాఠశాలల బంద్ విజయవంతం

**హుస్నాబాద్ టౌన్, జూన్ 26, ప్రభాతవార్త :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి)రాష్ట్ర శాఖ పిలుపు మేరకు పిలుపునిచ్చిన పాఠశాలల బంద్ విజయవంతంగా ముగిసిందని ఎబివిపి రాష్ట్ర హుస్నాబాద్ నగర కార్యదర్శి కంసాని రాకేష్ తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ హుస్నాబాద్,అక్కన్నపేట,కోహెడ మండలాలలో కొన్ని విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించగా తెరిచి ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బైకాట్ చేశామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నుండి విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యావ్యవస్థకు పెద్ద పీఠ వేయడంతో పాటు ఖాళీగా ఉన్న పోస్టుల నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రరణ చట్టం వెంటనే తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాకేష్, చరణ్, సంతోష్, రాహుల్, రాజు, అభిరామ్, కార్తీక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్ మోడల్ స్కూల్ బంద్ చేయిస్తున్న ఎబివిపి నాయకులు

# కొమ్మూరి ఆక్రమించిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందే బీరన్న



మాట్లాడుతున్న మల్లారెడ్డి, అందె బీరన్న

**చేర్యాల, జూన్ 26, ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆక్రమించిన ప్రభుత్వ భూదాన్, సీలింగ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందె బీరన్న అన్నారు. బుధవారం పట్టణంలోని షాదీఖాన ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన సమావేశం కొంగరి వెంకట్‌మావో అధ్యక్షతన జరగగా ఆముదాల మల్లారెడ్డి, అందెబీరన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేర్యాల పట్టణ శివారు బీడికాలనీ సమీపంలో ఉన్న సర్వే నెంబర్ 1030 లో 7ఎకరాల ఒకగుంట భూధాన్ సీలింగ్ భూమిని ఆక్రమించుకున్నాడని అన్నారు. అలాగే ముస్త్యాల, రేబర్తి, లద్నూరు బంజారా గ్రామాల శివారులలోని భూములనూ ఆక్రమించారని తెలిపారు. చేర్యాల మున్సిపాలిటి పరిధిలోని తన వెంచర్‌లో మున్సిపాలిటీకి రావాల్సిన భూమిని ఇవ్వకుండా ప్లాట్లుగా చేసి అమ్ముకున్నాడని చెప్పారు. వెంచర్‌లోనే పెట్రోల్ బంక్ పక్కన కొంత ఖాళీస్థలం ఉందని, ఆ స్థలాన్ని మున్సిపాలిటీ అధికారులు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళ్మిట్ట మండలాల పరిధిలో సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూములు తన ఆధీనంలో ఉన్నాయని, రైతులెవరైన ప్రశ్నిస్తే బెదిరిస్తూ, అసభ్యంగా మాట్లాడుతున్నాడని ఇలాంటి కబ్జాకోరును పార్టీ నుండి తొలగించి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. ఆక్రమించిన భూములపై నిజ నిర్ధారణ కమిటీ వేసి తద్వారా ఆ భూములను ప్రభుత్వ, ప్రజావసరాలకు ఉపయోగించుకునే విధంగా పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ కొమురవెల్లి మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ కొమురవెల్లి దేవస్థానం పరిసరాల్లోనూ ప్రభుత్వ భూమిని కబ్జా చేశాడని ఆరోపించారు. కార్యక్రమంలో పోలోజ్ కుమారస్వామి, ఆలేటి యాదగిరి, బండకింది అరుణ్ కుమార్, రాళ్లబండి నాగరాజు, ఆముదాల నర్సిరెడ్డి, ముస్త్యాల ప్రభాకర్, పోలోజు శ్రీహరి, రాళ్లబండి భాస్కర్, బోయిని మల్లేశం, ఎర్రబోస్ అశోక్, ఆముదాల రంజిత్‌రెడ్డి, దర్శనం రమేష్, ఎన్ కనకయ్య, స్వర్గం శ్రీకాంత్, గర్నపల్లి చంద్రం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ నవతాగౌడ్

## యువత మంచి మార్గాన్ని ఎంచుకోవాలి : ఎస్ఐ

**వెల్దుర్తి, జూన్ 26 ప్రభాతవార్త:** డ్రగ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం వెల్దుర్తిలో ఎస్ఐ నవతాగౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ బాలస్వామి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, నేటి యువత మంచి మార్గాన్ని ఎంచుకోవాలని, డ్రగ్స్ జోలికి వెళ్లొద్దని ఆమె అన్నారు. నేటి యువత ఎక్కువ శాతం డ్రగ్స్‌కు అలవాటు పాల్పడి క్షణికావేశాలతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని, అలా కాకుండా మంచి మార్గాన్ని ఎంచుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



మాదక ద్రవ్యాల జోలికి పోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

**చౌటకూరు, జూన్ 26, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని ఎన్‌సిసి క్యాడెట్స్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. మాదక ద్రవ్యాలు వినియోగించబోమని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, రవీందర్, కృష్ణ, ఎన్‌సిసి అధికారి భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

**కందిలో...**



మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకుంటున్న దృశ్యం

**కంది, జూన్ 26, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని వ్యవసాయకళాశాలలో జరుపుకున్నారు.

## వైస్ చైర్మన్‌ను సన్మానించిన చైర్మన్

**జహీరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** జిల్లా ఎస్టీ సెల్ వైస్ చైర్మన్ నాగు చౌహాన్‌ను ఎఫ్‌డిసి చైర్మన్ గిరిధర్‌రెడ్డి బుధవారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని శేఖాపూర్ తండాకు చెందిన నాగు చౌహాన్‌కు ఇటీవల ఆదివాసీ కాంగ్రెస్ పర్త జిల్లా ఎస్టీ సెల్ వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు, వైస్ చైర్మన్‌గా నియామకం అయిన నాగు చౌహాన్‌ను ఎఫ్‌డిసి చైర్మన్ బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



ఎస్టీ సెల్ వైస్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఎఫ్‌డిసి చైర్మన్ గిరిధర్‌రెడ్డి



మెగా ప్లాంటేషన్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ల్లా ప్లాంటేషన్ సూపర్‌వైజర్ శ్రావణ్, ఎంపీడీవో రఫీక్ ఉస్నీన

## మెగా ప్లాంటేషన్ స్థల పరిశీలన

**పెద్దశంకరంపేట, జూన్ 26 ప్రభాతవార్త:** వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా త్వరలో చేపట్టనున్న మెగా ప్లాంటేషన్ గురించి పట్టణ శివారులోని స్థలాన్ని జిల్లా ప్లాంటేషన్ సూపర్‌వైజర్ శ్రావణ్, ఎంపీడీవో రఫీక్ ఉస్నీసాలు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని గ్రామాలలో వన మహోత్సవ కార్యక్రమం చేపట్టేందుకు గుంతలు తీసే పనులు చురుకుగా కొనసాగుతున్నాయని, వర్షాలు కురియగానే మొక్కలను నాటుతామని తెలిపారు. నర్సరీలలో మొక్కలు అందుబాటులో ఉన్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో నవాజుద్దీన్, టీఏలు రమేష్, సుభాష్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

**నారాయణఖేడ్ టౌన్, జూన్ 26, ప్రభాతవార్త:** మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలను బుధవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి పరిశీలించారు. పాఠశాల ఆవరణలోని మూత్ర శాలలను, వంటశాలలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణి చేశారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యల రాకుండ చూడాలని, సమస్యల పరిష్కారానికి తన దృష్టికి తేవాలని సూచించారు.

**ఆసుపత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే...**

పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని ఎమ్మెల్యే సంజీవరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో ఎమ్మెల్యే డాక్టర్, సిబ్బందిపై అక్షింతలు చల్లారు. డాక్టర్లు సమయ పాలన పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోగులకు మెరుగైన వైద్య అందించాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి, రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, మాణికనయం.శంకర్ ముదిరాజ్, వివేకానంద, హన్మండ్లు, రామకృష్ణ, నర్సింలు, సద్దాం పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడిగా రాములు



రాములుకు నియామక పత్రం అందచేస్తున్న దృశ్యం

**సంగారెడ్డి టౌన్, జూన్ 26, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగా పోచారం రాములును నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి బుధవారం నియామక పత్రాన్ని అందచేశారు. తనకు జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించిన జిల్లా అధ్యక్షులకు, అందుకు సహకరించిన నాయకులు రాములు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి తన వంతు సహకారం అందిస్తానని హామి చేశారు.

## పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం

**కంది, జూన్ 26, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన కందిలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న వ్యవసాయ భూముల సర్వేకు సంబంధించి మొబైల్ యాప్ నిర్వాహణపై అవగాహన కల్పించారు. మొబైల్ యాప్ డైన్‌లోడ్ చేసుకుని పంచాయితీ కార్యదర్శులకు కేటాయించిన గ్రామాల్లో తక్షణమే వ్యవసాయ భూముల సర్వే నిర్వహించుటకు, చెట్లు నాటడానికి గుంతల తీయుల, చెట్లు నాటుట ఉపాధి హామి పథకం పనులు జరుగుతున్న తీరు, మిషన్ భగీరథ సర్వే తదితర అంశాలపై సమావేశంలో పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల పంచాయితీ అధికారి మహిందర్‌రెడ్డి, ఇంచార్జి ఎంపిడిఓ వేణుగోపాల్, అధికారులు ప్రసాద్, గురుపాదం, ఏఈఓలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : ఎంపిపి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ స్వరూపనరేందర్‌రెడ్డి

**వెల్దుర్తి, జూన్26 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బీసీ హాస్టళ్లను బుధవారం ఎంపీపీ స్వరూప నరేందరెడ్డి ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలల్లో అందిస్తున్న విద్యా బోధన, భోజన సదుపాయాలు, అలాగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూప్రకారం విద్యార్థులకు అందించాలని సూచించారు. పాఠశాలను జిల్లాలో ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. భోజనంలో నాణ్యతగల కూరగాయాలను వాడాలన్నారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిసరాలను పరిశీలించి ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులకు ఎన్నో మౌలిక సదుపాయాలు అందజేస్తుందని, వాటిని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఆసుపత్రిలో ప్రసూతి అయిన వారికి కిట్‌లను అందజేశారు. అలాగే ఆసుపత్రి రిజిష్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రక్త నమూనాలు, షుగర్, బీపీ వంటి పరీక్షలు సైతం నిర్వహించడం జరుగుతుందని, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీసీ హాస్టల్‌లోనూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి విద్యార్థులు ఎలంటి రోగాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత వార్డెన్‌లనే అన్నారు. మూడు నెలల నుండి బిల్లులు రావడం లేదని వార్డెన్ శ్రీనివాస్ తెలిపారు. అలాగే మండలంలోని మానెపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చుదువున్న 11 మంది విద్యార్థినిలకు కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించడంతో వారికి కరాటే శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్‌ను అభినందించి వారికి సర్టిఫికెట్లను అందజేశారు.

ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు నరసింహారెడ్డి, నాయకులు మల్లేశం, డాకులు, శ్రీను, డాక్టర్ సౌజన్య, కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపాల్ ఫాతిమ, వార్డెన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న

**హుస్నాబాద్, జూన్ 26, ప్రభాతవార్త :** ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సర్ ఆకుల రజితవెంకన్న అన్నారు. బుధవారం నాలుగో వార్డులో జెసిఎల్ ఫౌండేషన్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో తడి,పొడి చెత్త బుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఇంట్లోనే తడి పొడి చెత్తలను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. ఇంట్లో మొక్కలు ఉన్నవారు తడి,పొడి చెత్తలతో వేరు చేసుకుని కంపోస్టు ఎరువు తయారు చేసుకుని వాడుకోవచ్చన్నారు. అంతేకాకుండా నిత్యావసర సరుకుల కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను కాకుండా బట్టసంచులు వాడాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. నిబంధనలు ఉల్లంగించి ఎవరైనా ప్లాస్టిక్ వాడితే వారికి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ మల్లిఖార్జున్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, అధికారులు రవికుమార్, వెంకటేష్, జెసిఎల్ ఫౌండేషన్ ఫౌండర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## జీలుగ సాగుతో పంటలకు లాభాలు : ఎవో

**చేర్యాల (మద్దూరు), జూన్ 26,ప్రభాతవార్త :** జీలుగ సాగుతో పంటలకు విశేషమైన లాభాలు ఉంటాయని మద్దూరు వ్యవసాయ అధికారి బి.రామకృష్ణ తెలిపారు. బుధవారం మండలకేంద్రం పరిసరాల్లోని జీలుగ పంటలను ఏవో పరిశీలించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ జీలుగ సాగుతో నేల సారవంతమై అధిక పంట దిగుబడులు సాధించవచ్చునని, భావితరాలకు ఎలాంటి రసాయనిక ఎరువులులేని నాణ్యమైన, ఆరోగ్యవంతమైన ఆహార పంటలు అందిచవచ్చన్నారు రైతులకు సూచించారు. ఆయనతో ఏఈవో రాకేష్, రైతులు ఉన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన బిఎస్‌పి నేతలు

**హుస్నాబాద్, జూన్ 26, ప్రభాతవార్త :** పట్టణానికి చెందిన తొలితరం వైద్యులు బొద్దున రంగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న బహుజన్ సమాజ్ పార్టీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనగందుల శంకర్, హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ పచ్చిమట్ల రవిందర్ గౌడ్ బుదవారం వారి కుటుంబ సభ్యులనుపరామర్శించారు. ఈ సందర్బంగా వారి మృతికిగల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పరామర్శించిన వారిలో ఆ పార్టీ నాయకులు వేల్పుల రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజం



ప్రధానోపాధ్యాయులు రామచంద్రాచారిని సన్మానిస్తున్న దృశ్యం

**పెద్దశంకరంపేట, జూన్ 26 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగులకు విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని మండల నోడల్ అధికారి డి. వెంకటేశం అన్నారు. బుధవారం మండల పరిధిలోని చీలపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆసూరి రామచంద్రాచారి పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమేనని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసినప్పుడే జీవితానికి సార్థకత ఏర్పడుతుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే ఉద్యోగులకు చిరకాల గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరరావు, సుభాష్, ఆయా సంఘాల నాయకులు బి.శ్రీనివాస్, మారుతి, ఎన్. శ్రీనివాస్, గోపి, ఆనంద్, ప్రసన్న, సుజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దు : సిఐ



మాట్లాడుతున్న అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి

**పెద్దశంకరంపేట, జూన్ 26 ప్రభాతవార్త:** యువత చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ యాంటీ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పెద్దశంకరంపేటలో జూనియర్ కళాశాల, పదవ తరగతి విద్యార్థులతోకలిసి ర్యాలీ నిర్వహించిన అనంతరం గాంధీ చౌక్‌వద్ద డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు కష్టపడి చదవాలని, గంజాయి, మాదక ద్రవ్యాలతో పాటు చెడు వ్యసనాలకు బానిస కావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శంకర్, ప్రిన్సిపాల్ అవనీష్‌రెడ్డి, హెచ్‌ఎంలు వీఠల్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల, కళాశాలల

## ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలి



మాట్లాడుతున్న ఎబివిపి నాయకులు

**కొల్చారం, జూన్26 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టి ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని ఏబీవీపీ నాయకులు గిరి, గంగరాజు డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏబీవీపీ పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా కొల్చారం మండల వ్యాప్తంగా, రంగంపేటలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఏబీవీపీ ఆధ్వర్యంలో మూసివేసి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల్లో అక్రమ ఫీజులను అరికట్టి ఫీజు నియంత్రణచట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు గిరి, గంగరాజు, చిన్న, సాగర్, సాయి, ఉదయ్, రాజేష్, అంజి, అర్జున్, శ్రీఖర్ పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

**వెల్దుర్తి, జూన్26 ప్రభాతవార్త:** హల్దీ వాగులో నుండి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ఓ ట్రాక్టర్‌ను బుధవారం నమ్మదగిన సమాచారం మేరకు పట్టుకొని కేసు నమోదు చేయడం జరిగిందని స్థానిక ఎస్ఐ నవతాగౌడ్ తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే వారిపైన చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్